సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 25 । జనవరి । 2025



డీటీసీపై బదిలీ వేటు

జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డిపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. విజయవాడ రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. -IIలో



కూటమి పాలనలో అరాచకం

కూటమి పాలనలో దుర్మార్గం, అరాచకం అధికమైందని, ఎలాంటి అభివృద్ధి జరగలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
31.6/17.2

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 17.2 - 31.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

తిరుపతి ఐసీడీఎస్ పీడీగా వసంతబాయి



కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వసంతబాయిని నియమిస్తూ మహిళా శిశు సంక్షేమశాఖ సెక్రటరీ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె 2016 నుంచి 2022 వరకు రాయచోటి సీడీపీఓగా పనిచేశారు. అనంతరం రీజినల్ వేర్ హౌస్ మేనేజర్‌గా నియమితులయ్యారు. అలాగే బద్వేలు, కమలాపురం ఇన్‌ఛార్జి సీడీపీఓగా పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి పీడీగా బదిలీపై వెళ్లనున్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు దిరశవంచ సర్పంచ్‌కు ఆహ్వానం



అమీర్ బాషా

బ్రహ్మంగారిమఠం: జాతీయ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 26న న్యూ ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ కవాతును తిలకించేందుకు బ్రహ్మంగారి మఠం మండలంలోని దిరశవంచ గ్రామ సర్పంచ్ అమీర్ బాషాకు ఆహ్వానం అందింది. ఈ మేరకు సర్పంచ్ అమీర్ బాషా సతీసమేతంగా హాజరుకావాలని, వీరితో మరొక సర్పంచ్‌ను వెంట తెచ్చుకోవచ్చని ఉత్తర్వులు అందాయని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూచనలు అనుసరించి రాష్ట్రంలో పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ పథకాలతో కనీసం ఆరు పథకాలను సంతృప్తికరంగా అమలు చేసిన గ్రామ సర్పంచ్‌లను దేశ వ్యాప్తంగా ఎంపిక చేశారని.. ఈ క్రమంలో బ్రహ్మంగారిమఠం మండలం దిరశవంచ సర్పంచ్ ఎంపికైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

గీత కులాలకు మద్యం షాపులు



లాటరీ తీస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని గీత కులాలకు లాటరీ పద్ధతిలో 14 మద్యం షాపులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి కేటాయించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024–26 సంవత్సరానికి సంబంధించి మద్యం షాపులకు ఆయా గీత కులాలను ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 13 ప్రకారం జిల్లాలోని మొత్తం మద్యం షాపుల్లో 10 శాతం గీత కులాలకు కేటాయిస్తున్నామన్నారు. ఈనెల 27 నుంచి ఆయా గీత కులాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ దరఖాస్తులకు ఆఖరు గడువని, 7వ తేదీ లాటరీ ద్వారా మద్యం షాపులు కేటాయిస్తామని వివరించారు. జిల్లాలో గౌడ్ కులానికి 4, ఈడిగ 8, గౌడ 1, గౌండ్ల 1 చొప్పున కేటాయించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రవికుమార్, సీఐ కృష్ణకుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యత



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: బాలికల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యావంతులైన ఆడపిల్లలు పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా అన్ని రంగాల్లో ప్రావీణ్యత సాధిస్తున్నారని పేర్కొన్నారు. విద్య వల్ల మనోధైర్యం వస్తుందని, అప్పుడు అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్న దానికి సునీత విలియమ్స్ ఒక ఉదాహరణ అని తెలిపారు. ఆత్మరక్షణ కోసం కరాటే వంటి విద్యలు నేర్చుకోవాలన్నారు. ఆడపిల్లలను చదివించాలని, లింగ వివక్ష చూపరాదని సూచించారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ బాలికల విద్య, ఆరోగ్యం, రక్షణ వంటి అంశాలపై శ్రద్ధ వహించాలని చెప్పారు. అనంతరం ఆడపిల్ల దేశానికే గర్వకారణం అన్న పోస్టర్లను జేసీ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

కత్తి మీద సాము!

ఎస్పీకి సమస్యల సవాల్

- అధికారపార్టీ నేతల విచ్చలవిడి దోపిడీ పర్వం
- సివిల్ పంచాయతీలు, గ్యాంబ్లింగ్‌లో మునిగి తేలుతున్న త్రిబుల్ స్టార్ అధికారులు
- చట్టాన్ని విస్మరించి ఏకపక్ష చర్యలకు అలవాటు పడిన వైనం



కడప నగరం.. ద్వారకానగర్‌లో టీడీపీ నేతలు చదును చేసిన ప్రభుత్వ స్థలం (ఫైల్) (ఇన్‌సెట్) ఎస్పీగా బాధ్యతలను చేపట్టిన ఈ.జి అశోక్‌కుమార్

సాక్షి ప్రతినిధి కడప: జిల్లా నూతన ఎస్పీగా ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. విపక్షనేత సొంత జిల్లాలో చట్టాన్ని పరిరక్షించడంలో ఆయన పాత్ర అత్యంత కీలకం. అటు అసాంఘిక శక్తులను నియంత్రించడం, ఇటు అధికారపార్టీ నేతల అడ్డగోలు దందాలు, అక్రమాలు అరికట్టడం, ఏకపక్ష చర్యల్లో తలమునకలైన పోలీసు అధికారులను కట్టడి చేయడం.. ఇవన్నీ పెను సవాళ్లు కానున్నాయి. చట్టం కొందరికి చుట్టం కాకుండా చూడాల్సిన ఆవశ్యకత లేకపోలేదు. మరోవైపు పాత పరిచయాలు కొత్త సమస్యలు తీసుకవచ్చే అవకాశం ఉంది. వెరశి జిల్లాలో ఎస్పీ బాధ్యతలు కత్తి మీద సాము కానున్నట్లు విశ్లేషకుల అభిప్రాయం.

- ప్రభుత్వం రెండున్నర నెలల తర్వాత మన జిల్లాకు రెగ్యులర్ ఎస్పీగా ఈజీ అశోక్‌కుమార్‌ను నియమించింది. ఆమేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రతిపక్షనేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సొంత జిల్లా, కూటమి ప్రభుత్వం నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. కీలకమైన జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉంచాల్సి ఉంది. ఎస్పీగా వస్తున్న అశోక్‌కుమార్ కడప డీఎస్పీగా సుమారు మూడేళ్లపాటు గతంలో పనిచేశారు. ఆయనకు జిల్లాపై అవగాహన ఉన్నప్పటికీ ప్రస్తుతం పరిస్థితులు మారాయి. కొందరు పోలీసు అధికారుల్లో అప్పటి కరుకుదనం, చురుకుదనం లేదనే విమర్శలు ఉన్నాయి. కేసుల విచారణ కూడా ఏకపక్షంగా తెరపైకి వస్తున్నాయి. ఈ నేపధ్యంలో పోలీసుశాఖను గాడిలో పెట్టాల్సి ఉంది. రాజకీయ ఒత్తిళ్లు పెను సవాళ్లు ఎదుర్కోవాల్సి వచ్చే అవకాశం ఉంది.

ట్రాఫిక్ అస్తవ్యస్తం..

కడపలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. సిగ్నల్ వ్యవస్థ కూడా అంతంత మాత్రమే. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా ఎస్పీ బంగళా ఎదుట ఉన్న సిగ్నల్స్ నిలుస్తున్నాయి. ఎటువైపు నుంచి ఎవరొస్తారో అర్థం కాకుండా ప్రయాణికులు వెళ్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో యువత ఇష్టారాజ్యంగా బైక్ రైడింగ్ చేస్తోంది. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

భూ కబ్జాలపై ఉదాసీనత...

జిల్లాలో విచ్చలవిడిగా భూకబ్జాలు తెరపైకి వస్తున్నాయి. సుప్రీంకోర్టు ఉత్తర్వులు సైతం ఉల్లంఘిస్తూ వాగులు, వంకలు, చెరువులు భూకబ్జాలకు పాల్పడుతున్నారు. అందులో అధికారపార్టీ నేతల ప్రమేయం అధికంగా ఉంది. స్థానికులు ఫిర్యాదు చేసినా నిరుపయోగమే అవుతోంది. ఇలాంటి పరిస్థితి మైదుకూరు సబ్ డివిజన్‌లో అత్యధికంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. బాధితులకు సత్వర న్యాయం మాటే కన్పించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీసు బాస్‌గా పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేపట్టాల్సి అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

త్రిబుల్ స్టార్ అధికారుల ఇష్టారాజ్యం..

జిల్లాలో పోలీసుశాఖ గాడిలో పడాల్సి ఉంది. చట్టాన్ని పరిరక్షించే అధికారులకు కొదవ లేదు. కొంతమంది త్రిబుల్‌స్టార్ అధికారుల చర్యల కారణంగా చాలా మంది అక్రమ సంపాదనపై పక్క చూపులు చూడాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. పులివెందుల సబ్ డివిజన్‌లో ఓ అధికారి ఏకంగా గ్యాంబ్లింగ్ నిర్వహణకు అడ్డాగా మార్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి జమ్మలమడుగు, కడప, మైదుకూరు సబ్‌డివిజన్లలో కూడా లేకపోలేదు.



- కడప సబ్ డివి జన్‌లో ఇసుక అక్రమార్కుల నుంచి ప్రతి రోజు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ పోలీసు శాఖకు మచ్చ తీసుకవచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మైదుకూరు, కడప, బద్వేల్, ప్రొద్దుటూరు సబ్ డివిజన్లలో భూకబ్జాలకు అండగా కొందరు అధికారులు నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గాడి తప్పిన పోలీసు అధికారులను గాడిలో పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

సమష్టి కృషితో మెరుగైన పోలీసింగ్

- తప్పు చేసిన వారికి, తప్పు చేయని వారికి మధ్య తేడా ఏమిటో చూపిస్తాం
- రూరల్ పోలీసింగ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తాం
- జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఈజీ అశోక్‌కుమార్



కలెక్టర్‌తో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్: జిల్లాలో ఎవరైనా సరే తప్పు చేసిన వారికి, తప్పు చేయని వారికి మధ్య తేడా ఏమిటో చెప్పేలా పోలీసింగ్ ఉండేలా కృషి చేస్తామని ఎస్పీ ఈ.జి. అశోక్‌కుమార్ తెలియజేశారు. శుక్రవారం జిల్లా నూతన ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కడప జిల్లాకు ఎస్పీగా రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతపురం జిల్లా నార్పల తమ స్వగ్రామమనీ, తమ తల్లిదండ్రులు సుబ్బయ్య, సావిత్రిమ్మలకు రుణపడి ఉంటానన్నారు. తాను 2010సంవత్సరంలో గ్రూప్–1 పరీక్ష ద్వారా డీఎస్పీగా ఎంపికైన తరువాత వివిధ ప్రాంతాలలో విధులు నిర్వర్తించానని, అందులో భాగంగా 2014 నుంచి 2017 సంవత్సరం వరకు దాదాపు రెండు సంవత్సరాల 10 నెలలపాటు కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా విధులను నిర్వహించానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో సమష్టిగా కృషి చేస్తామన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల అఘాయిత్యాలు జరుగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా ప్రజలు ఎస్పీ కార్యాలయానికి రావడానికి ఎలాంటి సంకోచానికి గురికావాల్సిన అవసరం లేదన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి మరింత కృషి చేస్తామన్నారు. రూరల్ పోలీసింగ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తామన్నారు. మేధావులు, మీడియా, ప్రజలు భాగస్వామ్యంతో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అందిస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌కు అనుసంధానం చేయడమనే ఆలోచనను జిల్లాలో అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)కె. ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏ.ఆర్)బి. రమణయ్య, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఎస్పీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అశోక్‌కుమార్ కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్‌ను కలెక్టర్ అభినందించారు.

విధి నిర్వహణలో పోలీసు ప్రతిష్టను పెంపొందించాలి

జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందించేలా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, నగరంలోని ఎస్ఐలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం)కు వచ్చే ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి. రమణయ్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కడప తాగునీటి పనులపై నిర్లక్ష్యం ఎందుకు?

- దాహార్తిని తీర్చే అమృత్ స్కీమ్ పనులు ఏమయ్యాయి?
- దిశ సమావేశంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: కడప నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమృత్ పథకం కింద రూ. 500 కోట్లతో ఎన్నికలకు ముునుపే తమ ప్రభుత్వ హయాంలో టెండర్లు నిర్వహించారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా పనులు ఎందుకు చేపట్టలేదో చెప్పాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంపీ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ డాక్టర్ శ్రీధర్, జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నగర మేయర్ కె.సురేష్‌బాబుతోపాటు పలువురు ఎంపీపీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కడప నగరం తాగునీటి అంశం చర్చకు వచ్చింది. వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కడప ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆనాటి తమ ప్రభుత్వ హయాంలో అమృత్ స్కీమ్ కింద నిధులు మంజూరు చేయించామన్నారు. అలాగే టెండర్లు కూడా పూర్తయ్యాయని, అగ్రిమెంటు కుదుర్చుకుని పనులు చేపట్టే దశలో ఎన్నికలు రావడంతో ప్రక్రియ ఆగిందన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజల తాగునీటి అవసరాలు దృష్టిలో పెట్టుకుని సత్వరమే పనులు ప్రారంభించాలని కోరారు. కార్పొరేషన్ అధికారి మాట్లాడుతూ అమృత్ పథకం ఫేజ్–1 కింద వాటర్ సప్లయ్ ఇంప్రూమెంట్ పథకం కింద రూ. 43.32 కోట్లు అర్బన్ లోకల్ బాడీ ద్వారా ఆమోదం పొందగా, అందులో 63 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్వచ్ఛభారత్ స్కీమ్ 2.ఓలో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో 23.46 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీ సూచించారు.

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే దిశ సమావేశంలో ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే సూచనలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. ఉపాధి ద్వారా త్వరలో మరిన్ని నిధులు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, తాగునీరు, స్మశానాలు, పొలాలకు రోడ్లు వంటి అవసరాలకు ఖర్చు చేస్తామన్నారు. గతంలో అట్లూరులో పేదలకు ఇచ్చిన ఇల్లు పాడైపోయాయని, ఏదైనా పథకం ద్వారా మరమ్మత్తులు చేయించాలని ఆ మండల ప్రజాప్రతినిధులు కోరారు. పులివెందుల జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు పూర్తి కాక లబ్ధి దారులు ఇళ్లల్లో చేరలేకపోతున్నారని ఆ ప్రాంత ప్రజాప్రతినిధులు తెలిపారు.

పీఎంజీఎస్‌వై కింద పనులు

ఆకాంక్షిత జిల్లాలో భాగమైన చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాల్లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద మరికొన్ని పనులు మంజూరు చేసేందుకు సమావేశంలో తీర్మానించారు. ఉద్యానశాఖ ద్వారా మరింత ఎక్కువమంది రైతులు లబ్ధి పొందేందుకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తీర్మానించారు.

కూటమి ప్రజాప్రతినిధుల గైర్హాజరు

వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించి ఏవైనా క్షేత్రస్థాయి సమస్యలు ఉంటే పరిష్కరించుకునేందుకు ఉద్దేశించిన ముఖ్యమైన దిశ సమావేశానికి జిల్లాలోని ఎన్‌డీయే కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాలేదు. ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నా సమావేశానికి ఏ ఒక్కరూ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

జాతీయ క్రీడలకు ముగ్గురు బ్యాడ్మింటన్ నిపుణులు



ఎస్.జిలానీబాషా వి. నాగరాజు కె.మనోహర్‌బాబు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ముగ్గురు సీనియర్ క్రీడాకారులకు ప్రతిష్టాత్మక 38వ జాతీయ క్రీడల్లో టెక్నికల్ అఫిషియల్స్‌గా పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జాతీయ క్రీడలను నిర్వహించనున్నారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్‌గా, అంతర్జాతీయ అంపైర్‌గా వ్యవహరిస్తూ ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. జిలానీబాషా, బ్యాడ్మింటన్ సంఘంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరిస్తూ, జాతీయస్థాయిలో గ్రేడ్–1 అంపైర్‌గా అర్హత సాధించి, కడప జిల్లా కోర్టులో గ్రేడ్–1 స్టెనోగా పనిచేస్తున్న వి. నాగరాజు, చిట్వేలి మండలంలో వెంకటరాజుపల్లె పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న గ్రేడ్–2 నేషనల్ అంపైర్ కె. మనోహర్‌బాబు ఎంపికయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే నేషనల్ గేమ్స్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు బ్యాడ్మింటన్ నిపుణులు టెక్నికల్ అఫిషియల్స్‌గా ఎంపికవడం పట్ల జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

చిగురించిన ఆశలు

- రోజురోజుకు పెరుగుతున్న నిమ్మ ధరలు
- జిల్లా వ్యాప్తంగా 5వేల హెక్టార్లలో నిమ్మ సాగు
- బెంగళూరులో బస్తా రూ.1000
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



నిమ్మకాయలను రవాణా చేసేందుకు సంచులలో నింపుతున్న కూలీలు

వేంపల్లె: నిమ్మకాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో అన్నదాతల ఆశలు చిగురిస్తున్నాయి. నిలకడ లేని ధరలతో ఇబ్బందుల్లో ఉండే రైతులు ప్రస్తుతం ఉన్న ధరలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే నెల చివరి వారంలో రూ.300 నుంచి రూ.450 లోపే బస్తా ధర ఉండేది. కానీ ఈ ఏడాది పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. గత వారం రోజులుగా ధరలు పెరుగుతూ గురువారం నిమ్మకాయల బస్తా రూ.800 నుంచి రూ.1000ల ధర పలికింది. గత ఏడాదంతా మార్కెట్ ధరలు పుంజుకోకపోవడంతో నిమ్మ రైతులు నష్టాలను ఎదుర్కొన్నారు. అయితే ఇప్పుడిప్పుడు నిమ్మ ధరలు ఊపందుకోవడంతో అన్నదాతలలో సంతోషం మొదలైంది. ఈ ఏడాది జనవరి 15వ తేదీ నుండి బెంగళూరు మార్కెట్‌లో నిమ్మకాయల బస్తా మొదటి రకం రూ.800 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. గత పది నెలలుగా బెంగళూరు మార్కెట్‌లో మొదటి రకం నిమ్మకాయల బస్తా రూ.400 నుంచి రూ.500 పలికేది. రెండవ రకం కాయలు రూ.300 మాత్రమే పలికేవి. కనీసం రైతుకు కూలి పాటు కూడా పడడం లేదు. గత పది రోజులుగా ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో నిమ్మ సాగు చేసిన రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.

ఎకరాకు రూ.75 వేల పెట్టుబడి: రైతులు మొక్క నాటిన నాటి నుంచి ఐదేళ్లపాటు ఎన్నో వ్యయప్రయాసలకు లోనై పెట్టుబడులు పెడతారు. నిమ్మతోట సాగులో ఎకరాకు రూ.75వేలు పెట్టుబడులు అవుతున్నాయి. ఏడాదికి మూడు కాపులు వస్తాయి. సాగులో దశలవారీగా తోటలు పూతకు రావడంతో దిగుబడులు కూడా వస్తుంటాయి. ఏడాదిలో ఒక కాపునకు ధరలు వచ్చినా ఆశించిన స్థాయిలో ఆదాయం ఉంటుందని రైతులు చెబుతుంటారు. కానీ ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు కనిపించడంతో కొంతమేర నిమ్మ ధరలు పెరగవచ్చునని రైతులు అంటున్నారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సైతం ధరలు పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కూలీల ఖర్చులకు పోను మిగులు

నిమ్మతోటలో కాయలు కోసి కూలీ, కమీషన్, సంచి రవాణా ఖర్చుకు, వరిగడ్డి, ఎత్తిన దించిన ఖర్చులు పోనూ రూ.400 మిగులుతుందని రైతులు చెబుతున్నారు. గత పది నెలలుగా ధరలు పతనం కావడంతో రైతులు నిమ్మ సాగు చేయాలంటే నిరాశ వ్యక్తం చేసేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులలో కొంతమేర ధరలు ఆశాజనకంగా ఉండడంతో వారిలో ఉత్సాహం కలుగుతోంది.

నిమ్మ తోటల సాగు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5వేల హెక్టార్లలో నిమ్మ తోటలు సాగు చేశారు. అత్యధికంగా రైల్వే కోడూరు, వేంపల్లె, రాజంపేట, పెండ్లిమర్రి, చిట్వేలి, ముద్దనూరు, వీరపునాయిని పల్లె, చక్రాయపేట తదితర మండలాల్లోనూ, అత్యల్పంగా తొండూరు, సింహాద్రిపురం, వేముల, కొండాపురం, చింతకొమ్మదిన్నె, లింగాల తదితర మండలాల్లో నిమ్మ తోటలను సాగు చేశారు. ఇక్కడి నుంచి నిమ్మకాయలను బెంగళూరు, నాగపూర్, ఢిల్లీ తదితర మార్కెట్లకు వ్యాపారులు తరలిస్తుంటారు.

అప్పుల బారి నుండి బయటపడతాం



అప్పుల బారి నుండి బయటపడతామని అనుకుంటున్నాం. ధరలు రోజురోజుకు పెరిగిపోతుండటంతో రైతుల్లో ఆనందం కలుగుతోంది. ఆరు ఎకరాల్లో నిమ్మ తోటను సాగు చేశాను. గత రెండేళ్లుగా వర్షాలు సరిగా లేక భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. తోటలను బతికించుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేయించుకున్నాం. ఈ సీజన్‌లోనైనా మంచి ధరలు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– షేక్ మహమ్మద్ గౌస్, నిమ్మ రైతు, వేంపల్లె

ఈ ధరలు నిలకడగా ఉండాలి



నిమ్మ ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ ధరలు నిలకడగా ఉంటే మాత్రం రైతులకు కొంతమేర ఊరట కలిగిస్తుంది. కాయలు ఉన్నప్పుడు ధరలేక ఇబ్బందులు పడ్డాం. గత పది నెలలుగా ధరలు లేక ఇక్కట్లు పడ్డాం. ఇప్పుడు మార్కెట్‌లో ధర ఊపందుకుంది. పెట్టుబడి పోను ఆదాయం వస్తుందనే ఆశతో ఉన్నాం.

– చావలి గోపాల్, నిమ్మ రైతు, చింతలమడుగుపల్లె

క్లుప్తంగా

జీవో 117 రద్దు పేరుతో ఉపాధ్యాయులకు అన్యాయం

కడప ఎడ్యుకేషన్ : జీవో నెంబర్ 117 రద్దు పేరుతో విడుదల చేసిన మార్గదర్శకాలు ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే విధంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కడప జెడ్పీ సమావేశ మందిరంలో జీవో నెంబర్ 117 రద్దు, 3, 4, 5వ తరగతులు వెనక్కు పంపై అంశంపై సమావేశం జరిగింది. ఉపాధ్యాయ సంఘ నాయకులు, మేధావులను ఆహ్వానించకపోవడంతో ఆందోళన వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వం ప్రతి విద్యార్థికి సబ్జెక్టు టీచర్‌తో బోధన జరగాలనే ఉద్దేశంతో ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4 ,5వ తరగతలను జెడ్పీ పాఠశాలలకు అనుసంధానం చేసింది. వీటితో జరిగే ప్రయోజనాలపై ఇప్పుడిప్పుడే చర్చ మొదలైంది. ఇంతలోనే 117 జీవో రద్దు చేస్తూ నూతన మార్గదర్శకాలను రూపొందించారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. 3, 4, 5వ తరగతుల సబ్జెక్టు టీచర్లు ఉండరు. దీంతో డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం నెలకొంది. టీచర్ల సర్దుబాటు చేయడంతో ఉన్నత పాఠశాలల్లో ఎక్కువ సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్ టీచర్ల పోస్టులు మిగులు చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. గత నాలుగు నెలలుగా సంఘాలతో సమావేశాలు జరిపి వారి సూచనలు తీసుకోకుండా అనుకున్న విధంగానే మార్గదర్శకాలు విడుదల చేయడంపై ఉపాధ్యాయ సంఘాలన్నీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి

21 గ్యాస్ సిలెండర్లు స్వాధీనం

కడప అర్బన్ : కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు, సిబ్బందితో కలిసి వివిధ హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 21 ఇండేన్, హెచ్‌పీ గృహ అవసర సిలిండర్లను సీజ్ చేశారు. 5 వ్యాపార సంస్థల యజమానులపై నిత్యావసర సరుకుల చట్టం 1955 మేరకు 6(ఏ) కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులైన డిసిటిఓ బి. గీతావాణి, సీఎస్‌డీటీ పి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అమ్మ.. జయమ్మ

- సర్పంచ్‌గా, రోటరీ క్లబ్ ద్వారా సమాజ సేవ
- అందరి కష్టంలో పాలుపంచుకున్న జయమ్మ
- నేడు వైఎస్ జయమ్మ 19వ వర్ధంతి


వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మల కుటుంబ సభ్యులు (ఫైల్)

పులివెందుల రూరల్ : అడగందే అమ్మ అయినా అన్నం పెట్టదంటారు.. కానీ ఏమీ అడగకుండానే పేదలకు సాయం అందించిన అమ్మ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మాతృమూర్తి వైఎస్.జయమ్మ. వైఎస్.జయమ్మ జీవించి ఉన్నంతకాలం పులివెందులకు సంబంధించిన ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ అను నిత్యం దాన,ధర్మాలలో మునిగిపోయేది. మహా నేత వైఎస్.రాజశేఖరరెడ్డి సీఎం కావాలన్న ఆమె చిరకాల వాంఛ నెరవేరిన తర్వాత 2006 జనవరి, 25న జయమ్మ తుదిశ్వాస వదిలారు. అంతకుమునుపు 2003లో వైఎస్సార్ ప్రజల కష్టసుఖాలను తెలుసుకొనేందుకు పాదయాత్ర చేసిన సందర్భంలో తల్లిగా వైఎస్.జయమ్మ కుమిలిపోతూనే.. ఇంట్లో పాదయాత్ర చేస్తూ బిడ్డకు మంచి జరగాలని రోజూ ప్రార్థించేది. అంతేకాదు 1999లో విపరీతమైన కరవు పరిస్థితులు ఏర్పడినప్పుడు పది మందికి పట్టెడన్నం పెట్టాలని భావించిన మాతృమూర్తి వైఎస్.జయమ్మ. అప్పటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రతి రోజూ ఐదారు వందల మందికి ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించి ప్రశంసలందుకున్నారు. అంతేకాకుండా 1995 నుంచి 2000 వరకు పులివెందుల సర్పంచ్‌గా పనిచేసిన వైఎస్.జయమ్మ అప్పటి ప్రభుత్వం నుంచి ఉత్తమ సర్పంచ్ అవార్డుతోపాటు పంచాయతీని ఆదర్శంగా నిలిపి ఉత్తమ పంచాయతీ అవార్డును సొంతం చేసుకున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే వైఎస్.జయమ్మ జీవించినంత కాలం ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తూ పులివెందుల అమ్మగా గుర్తింపు పొందారు. ఆమె మరణించి నేటికి సరిగ్గా 18ఏళ్లు అవుతోంది.

నేడు వైఎస్ జయమ్మ వర్ధంతి వేడుకలు

దివంగత వైఎస్.రాజారెడ్డి సతీమణి వైఎస్.జయమ్మ 19వ వర్ధంతి వేడుకను శనివారం పులివెందులలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ కుటుంబ సభ్యులు పాలు పంచుకుంటారు. వైఎస్.జయమ్మ సమాధి వద్ద ప్రార్థనలతోపాటు.. స్థానిక పార్క్ వద్ద ఉన్న జయమ్మ విగ్రహం వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన తల్లి, మాజీ ఎమ్మెల్యే వైఎస్.విజయమ్మ, దివంగత వైఎస్.జార్జిరెడ్డి సతీమణి వైఎస్. భారతమ్మలతోపాటు వైఎస్సార్ సోదరుడు వైఎస్.సుధీకర్ రెడ్డి, కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్ కుటుంబ సభ్యులతోపాటు పలువురు వైఎస్ఆర్ అభిమానులు కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకోనున్నారు.

కూటమి పాలనలో అరాచకం

వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



పోరుమామిళ్ల : కూటమి పాలనలో దుర్మార్గం, అరాచకం అధికమైందని, ప్రతిపక్షంపై కక్ష సాధింపు చర్యలు తప్పితే ఎలాంటి అభివృద్ధి జరగలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు గత ఎనిమిది నెలలుగా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో పేకాట క్లబ్బులు వెలిశాయి... కోడిపందాలు ఊరూరా జరిగాయని పేర్కొన్నారు. కూటమి పాలన చూసిన ప్రజలు అధికార పార్టీపై ఆగ్రహంతో ఉన్నార న్నారు. రమణారెడ్డి, నిత్యానంద రెడ్డి, పులి సునీల్‌కుమార్, రాజగోపాలరెడ్డి, సింగమాల వెంకటేశ్వర్లు, నరసింహులు, రాజీవ్‌బాషా, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రమేష్‌బాబు, చాపాటి నారాయణ రెడ్డి, అంకగురివిరెడ్డి, ముత్యాల ప్రసాద్, బాషా, నారాయణ, యద్దారెడ్డి, రామకృష్ణారెడ్డి, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు మానుకుని హామీల అమలుపై దృష్టి సారించాలని పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఓ భూ వివాదం కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలైన గోపాలస్వామిని శుక్రవారం ఆయన రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. అక్రమ పెట్టినా భయపడేది లేదని తాను కార్యకర్తలకు అండగా నిలుస్తామని తెలిపారు. సుందర్‌రామిరెడ్డి, చల్లారవిచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, బుర్రిరాజా యాదవ్, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శభాష్ డ్రైవరన్నా..

మహిళ ప్రాణాలను కాపాడిన డ్రైవర్, కండక్టర్


హరి ప్రసాద్, కండక్టర్


కిరణ్, డ్రైవర్

కమలాపురం : కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ కిరణ్, కండక్టర్ హరి ప్రసాద్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఊపిరాడక ఇబ్బంది పడుతున్న ఓ మహిళ ప్రాణాన్ని కాపాడారు. స్థానికుల వివరాల మేరకు.. గురువారం రాత్రి చివరి సర్వీసులో భాగంగా రాత్రి 9గంటలకు ప్రొద్దుటూరు నుంచి కోగటం మీదుగా కడపకు వెళ్లే ఆర్టీసీ బస్సులో కమలాపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన డయాలసిస్ పేషెంట్ భాగ్యలక్ష్మి ప్రయాణం చేస్తోంది. సంబటూరు వద్దకు రాగానే భాగ్యలక్ష్మీకి ఆయాసం ఎక్కువై ఊపిరాడక తీవ్ర ఇబ్బంది పడుతోంది. ప్రయాణికులు గమనించి కండక్టర్ హరి ప్రసాద్‌కు తెలియజేశారు. దీంతో ఆయన డ్రైవర్ కిరణ్‌కు విషయం చెప్పారు. బాధిత మహిళలకు వైద్య సేవలు అందించాలనుకున్న డ్రైవర్ జాగ్రత్తలు పాటిస్తూ వేగంగా బస్సు నడిపి ఐదు నిమిషాల వ్యవధిలోనే కమలాపురం ఆసుపత్రి లోపలికి బస్సు తీసుకెళ్లారు. డ్రైవర్, కండక్టర్ ఆమెను ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య సిబ్బంది అప్రమత్తమై ఆమెకు అత్యవసర వైద్య సేవలందించి.. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. సకాలంలో ఆమెను ఆసుపత్రికి తీసుకురావడంతో భాగ్యలక్ష్మిని కాపాడగలిగామని సిబ్బంది చెప్పడంతో ప్రయాణికులు, స్థానికులు శభాష్... డ్రైవరన్న అంటూ డ్రైవర్‌ను అభినందించారు.

రిపబ్లిక్ డే కష్టాలు!

- శకటాలు తయారు చేయాల్సిందే
- డిపార్టుమెంట్ హెడ్స్‌పై కలెక్టరేట్ తీవ్ర ఒత్తిళ్లు
- నిధుల్లేవు...అవకాశం లేదని మొత్తుకున్నా పట్టించుకోని వైనం

సాక్షి ప్రతినిధి, కడప : రిపబ్లిక్ డే దినోత్సవం కష్టాలు ఉన్నతాధికారులను వెంటాడుతున్నాయి. అన్ని శాఖల నుంచి శకటాలను తయారు చేయాల్సిందేనని కలెక్టరేట్ నుంచి ఒత్తిళ్లు అధికంగా ఉన్నాయి. కంటిజెన్సీ గ్రాంటు కూడా దిక్కు లేదు, శకటాలు ఎక్కడ తయారు చేయగలమని కొంతమంది అధికారులు వాపోతున్నా, అవేమీ పట్టించుకునే స్థితిలో కలెక్టరేట్ లేదని సమాచారం. పైగా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా జారీ చేసిన ప్రొటోకాల్ నోట్ ఆర్డర్ పెట్టి మరీ డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ప్రధానమైన శాఖలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. చిన్న చితకా డిపార్టుమెంట్లను కూడా శకటాలను తయారు చేయమని చెప్పడం కష్టతరం కానుంది. దాదాపు రూ.1లక్షకు పైగా శకటానికి ఖర్చు రానుంది. అయితే నోట్ ఆర్డర్ 2671934/2025-28 ప్రకారం 18 ప్రభుత్వ శాఖలు శకటాలను ప్రదర్శించాల్సి ఉంది. అందులో ఆయా శాఖలను సైతం పొందుపర్చారు. నిధులు మంజూరు చేయకుండా శకటాలను డిపార్టుమెంట్ హెడ్స్ వారికి ఉన్న సోర్సు మేరకు శకటాలు తయారు చేయాల్సి ఉంది. అయితే నిధులు సమకూర్చుకునే అవకాశం ఉన్న శాఖలు చేయగలవు. అవకాశం లేని వారిపై కలెక్టరేట్ కార్యాలయం నుంచి భారీ స్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం. కారణాలు సైతం వినే పరిస్థితి కూడా లేనట్లు తెలుస్తోంది. అవన్నీ తెలియవు, ప్రభుత్వ నోట్ ఆర్డర్ ప్రకారం మీశాఖ పరిధిలో జనవరి 26న పరేడ్ గ్రౌండ్‌లో శకటం ప్రదర్శించాల్సిందే అంటూ బెదిరింపులకు దిగుతున్నారని సమాచారం. ఇలాంటి పరిస్థితులల్లో కొంతమంది తీవ్ర ఆవేదనకు గురవుతున్నట్లు సమాచారం. సొంతంగా లక్షలాది రూపాయలు భరించే స్థోమత లేదు. దాతలు ఎవరైనా ఆదరించే అవకాశం లేని విభాగాలకు చెందిన వారి పరిస్థితి సంకటంగా మారినట్లు తెలుస్తోంది. కలెక్టరేట్ నుంచి ఆయా విభాగాలకు నిధులు సమకూర్చి శకటాలు తయారు చేయాల్సిందిగా ఆదేశిస్తే యోగ్యకరం కానున్నట్లు పలువురు వివరిస్తున్నారు.

డీటీసీపై బదిలీ వేటు

- మహిళా ఉద్యోగిని ఫిర్యాదుతో విచారణ
- లైంగిక వేధింపులపై సీసీ పుటేజీ పరిశీలన


డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మహిళా అధికారిపై డీటీసీ లైంగిక వేధింపుల ఘటనలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక పంపామని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణ వేణి పేర్కొన్నారు. నగర శివారున ఊటుకూరు జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగినిపై జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తించిన తీరుపై విచారణ చేపట్టామని తెలిపారు. బాధిత ఉద్యోగి, ఆమె భర్త నుంచి స్టేట్ మెంట్ రికార్డు చేశామన్నారు. ఉదయం సదరు ఉద్యోగిని కార్యాలయానికి రమ్మని పిలిచి, అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె తన భర్తకు తెలిపిందని అన్నారు. ఉద్యోగి భర్త కార్యాలయం కొచ్చి డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డిని ప్రశ్నించగా.. ఆయన ఇరువురికీ క్షమాపణ చెప్పారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. అనంతరం కార్యాలయంలోని సీసీ పుటేజి పరిశీలించారు. పని చేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు ఉండరాదని, రవాణా శాఖ సర్వీస్ మాన్యువల్స్ లో స్పష్టంగా ఉందన్నారు. నివేదిక ఆధారంగా డీటీసీపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ డీటీసీగా ప్రొద్దుటూరు ఆర్టీవో మురళిని నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఆర్టీవో మురళీ, ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

డీటీసీపై బదిలీ వేటు

జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. విజయవాడలోని రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మహిళా ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటనలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి విచారణ జరిపి నివేదిక ప్రభుత్వానికి పంపారు. డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి పని చేసిన ప్రతిచోటా మహిళా ఉద్యోగినులపై అనుచితంగా వ్యవహరించడం పరిపాటేనని ఉద్యోగులలో చర్చ మొదలైంది. గుంటూరు జిల్లాలో పనిచేసే సమయంలో ఈ ఘటనలకు పాల్పడటంతో అక్కడ దేహశుద్ధి జరిగినట్లు సమాచారం. ఈయనను జిల్లాకు టీడీపీ ప్రజా ప్రతినిధులు కావాలనే తీసుకురావడం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. ఉద్యోగిని కుటుంబీకులను రాష్ట్ర రవాణా క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించి విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఏపీ వ్యాపారికి కుచ్చు టోపీ

- నకిలీ బంగారు అంటగట్టి దుండగుల మోసం
- రూ.20 లక్షల నగదు, మొబైల్‌తో ఉడాయింపు
- బాధితుడి స్వస్థలం వైఎస్సార్ కడప జిల్లా

శివమొగ్గ : శివమొగ్గ జిల్లా చుట్టు పక్కల మోసాలకు పాల్పడుతున్న నకిలీ బంగారం మోసగాళ్ల ముఠా సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన వ్యాపారికి టోకరా కొట్టారు. లక్షలాది రూపాయల నగదు తీసుకొని, మొబైల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. ఈ ఘటన జిల్లాలోని తీర్థహళ్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన శ్రీనివాస్(54)ను బళ్లారి జిల్లాకు చెందిన ఒక యువకుడు, మరొక వ్యక్తి కలిశారు. తమ వద్ద పాత కాలం నాటి బంగారం ఉందని, దానిని విక్రయించి తమకు నగదు ఇవ్వాలని కోరారు. వెంట తెచ్చిన ఒరిజనల్ బంగారాన్ని వ్యాపారికి చూపించారు, అది ఒరిజినల్ బంగారం అని నమ్మి కొనుగోలుకు అంగీకరించాడు. అనంతరం దుండగులు శ్రీనివాస్‌ను ఈ నెల 22న శివమొగ్గ జిల్లాలోని తీర్థహళ్లికి రప్పించుకున్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న ఆగుంబె రోడ్డులోని నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి బంగారం బిస్కెట్లు ఇచ్చారు. రూ.20 లక్షల నగదు, అతని మొబైల్ ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. తనకు ఇచ్చింది నకిలీ బంగారమని ఆలస్యంగా గ్రహించిన శ్రీనివాస్ తీర్థహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


జానీ(ఫైల్)

మైదుకూరు : మండలంలోని ఆదిరెడ్డిపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగెళ్లజానీ(40) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. తిప్పిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన తంగెళ్లజానీ, అతడి భార్య రేణుక కొన్నేళ్ల కిందట బతుకు దెరువు కోసం కువైట్కు వెళ్లారు. జానీ నెలకిందటే స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం వనిపెంటకు వెళ్లి తల క్షవరం చేయించుకుని బైక్‌పై తిరిగి గ్రామానికి బయలుదేరాడు. ఆదిరెడ్డిపల్లె సమీపంలో పోరుమామిళ్ల వైపు వరిగడ్డితో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో జానీ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఉరి వేసుకొని యువకుడు..

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం కన్నంపల్లి గ్రామానికి చెందిన కాట మదేవ గణేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం ఫంకాకు ఉరేసుకుని మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కన్నంపల్లి గ్రామానికి చెందిన గణేష్ వెటర్నరీ అసిస్టెంట్‌గా తొండూరు మండలం మల్యాల పనిచేస్తున్నారు. మృతి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. .

గోదాములు మూసి హమాలీల ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, హమాలీలు

కడప సెవెన్‌రోడ్స్ : పౌర సరఫరాల గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచుతూ తక్షణమే జీఓ విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గోదాములు మూసి హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాదుల్లా మాట్లాడుతూ కూలీ రేట్ల పెంపులో నిర్లక్ష్యం మూలంగా బంద్ చేయాల్సి పరిస్థితి నెలకొన్నదన్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌ను పాలక ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా చర్చల్లో పాల్గొని ఆమోదించిన ప్రకారం కూలీ రేట్లు రూ.25 నుంచి రూ.28లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మురారి, నాయకులు వెంకటరమణ, ప్రతాప్, రామ్మోహన్, రాజశేఖర్, శ్రీను శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీ అధ్యక్షుల నియామకం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని కడప, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల అనుబంధ కమిటీ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. - కడప కార్పొరేషన్

కడప నియోజకవర్గం

నియోజకవర్గంలో ఆయా విభాగాల వారీగా అధ్యక్షులను నియమిస్తూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. యువజన విభాగం అధ్యక్షుడిగా జి.వెంకటగురు నాగేంద్రను నియమించారు. దీంతోపాటు మహిళా విభాగానికి బండి దీప్తి, **రైతు విభాగం:** ఆర్.అశోక్‌కుమార్‌రెడ్డి, **బీసీ సెల్:** ఎస్.గంగరాజు, **ఎస్సీసెల్:** కంచుపాటిబాబు, **ఎస్టీ సెల్:** ఎస్.నాగేంద్ర ప్రసాద్, **మైనార్టీ సెల్:** షేక్ మహమ్మద్ షఫీ, **క్రిస్టియన్ మైనార్టీ సెల్:** ఎస్.విజయ్‌కిశోర్, **విద్యార్థి విభాగం:** టి.శివగంగాదర్ రెడ్డి, **మున్సిపల్ విభాగం:** ఆర్.చెన్నయ్య, **ఆర్టీఐ వింగ్:** తౌహీద్‌ఖాన్, **వలంటీర్స్ విభాగం:** బి.వంశీవరప్రసాద్, **గ్రీవెన్స్‌సెల్:** ఎం.మల్లికార్జున, **వాణిజ్య విభాగం:** ఎస్.ఫయాజ్‌బాషా, **వీవర్స్ విభాగం:** ఎం.సుబ్బరాయుడు, **వైఎస్సార్ టీయూసీ:** ఎస్.నాగరాజు, **అంగన్వాడీ విభాగం:** పి.చైతన్య, **లీగల్ సెల్:** ఎస్.తస్వీర్‌అహ్మద్, **కల్చరల్ వింగ్:** వై.సాయి హుసేన్, **సోషల్ మీడియా:** టి.నిషాంత్, **ఐటీ వింగ్:** ఎస్.ఫయాజ్, **దివ్యాంగుల విభాగం:** ఎస్.కరీముల్లా, **డాక్టర్స్ విభాగం:** పి.సతీష్‌కుమార్‌రెడ్డి, **పబ్లిసిటీ వింగ్:** కె.మహేష్, **మేధావుల విభాగం:** జి.అస్గర్ అలీఖాన్, **బూత్ కమిటీ విభాగం:** అస్మతుల్లాఖాన్ నియమితులయ్యారు.

బద్వేలు నియోజకవర్గం

యువజన విభాగం : ఎస్.శంకర్‌రెడ్డి, **మహిళా విభాగం :** జి.ముంతాజ్, **రైతు విభాగం :** జి.మల్లికార్జునరెడ్డి, **బీసీ సెల్ :** సి.చెన్నయ్య, **ఎస్సీ సెల్ :** దాసరి పుల్లయ్య, **ఎస్టీ సెల్ :** ఎస్.మునెయ్య, **మైనార్టీ సెల్ :** ఎస్.పాదిలిమస్తాన్, **క్రిస్టియన్ మైనార్టీ సెల్ :** కె.నాగరాజు, **విద్యార్థి విభాగం :** కె.శివానంద రెడ్డి, **పంచాయతీరాజ్ విభాగం :** సి.వెంగళరెడ్డి, **మున్సిపల్ విభాగం :** ఎస్.సాంబశివారెడ్డి, **ఆర్టీఐ వింగ్ :** ఎండీ.శివ, **వలంటీర్స్ విభాగం :** పి.రవికుమార్‌రెడ్డి, **గ్రీవెన్స్‌సెల్ :** పి.జగన్మోహన్‌రెడ్డి, **వాణిజ్య విభాగం :** జి.వెంకటసుబ్బయ్య, **వీవర్స్ విభాగం :** బి.రామచంద్రయ్య, **వైఎస్సార్ టీయూసీ:** డి.వెంకట సుబ్బయ్య, **అంగన్వాడీ విభాగం:** డి.సౌభాగ్యలక్ష్మి, **లీగల్ సెల్:** కె.గురుప్రభాకర్, **కల్చరల్ వింగ్:** ఎం.పెద్ద ఓబులేశు, **సోషల్ మీడియా విభాగం:** ఎం.వరకుమార్, **ఐటీ వింగ్:** బి.మధుసూదన్‌రెడ్డి, **దివ్యాంగుల విభాగం:** పి.వెంకటసుబ్బయ్య, **డాక్టర్స్ విభాగం:** ఎం.విష్ణువర్ధన్‌డ్డి, **పబ్లిసిటీ వింగ్:** కె.లక్ష్మిరెడ్డి, **మేధావుల విభాగం:** సి.వెంకటేశ్వరప్రసాద్, **బూత్ కమిటీ విభాగం:** ఎ.విజయభాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు.

జమ్మలమడుగు నియోజకవర్గం

యువజన విభాగం: ఎంవీ.హరీష్‌కుమార్‌రెడ్డి, **మహిళా విభాగం :** వి.మహాలక్ష్మి, **రైతు విభాగం:** టి.వెంకటేశ్వర్లు, **బీసీ సెల్:** జె.ప్రవీణ్‌యాదవ్, **ఎస్సీ సెల్ :** ఎస్.శీనయ్య, **ఎస్టీ సెల్:** ఎం.ధనానాయక్, **మైనార్టీ సెల్:** ఎస్.మహబూబ్ బాషా, **క్రిస్టియన్ మైనార్టీ సెల్:** ఎం.ప్రశాంత్, **విద్యార్థి విభాగం:** డి.సూర్యకిరణ్ రెడ్డి, **పంచాయతీరాజ్ విభాగం:** ఎం.గురుమోహన్‌రెడ్డి, **మున్సిపల్ విభాగం:** ఎస్.మహమ్మద్‌అలీ, **ఆర్టీఐ వింగ్:** వి.రమేష్‌కుమార్, **వలంటీర్స్ విభాగం:** కె.అవినాష్‌రెడ్డి, **గ్రీవెన్స్‌సెల్:** ఆర్.ప్రసాద్, **వాణిజ్య విభాగం:** ఎల్.విష్ణువర్ధన్‌రెడ్డి, **వీవర్స్ విభాగం:** జి.వెంకటరమణ, **వైఎస్సార్ టీయూసీ:** దాసరి రమణారెడ్డి, **అంగన్వాడీ విభాగం:** కె.సంగీత, **లీగల్ సెల్:** పి.రాజేశ్వర్‌రెడ్డి, **కల్చరల్ వింగ్:** జి.లక్ష్మయ్య, **సోషల్ మీడియా విభాగం:** బి.దివాకర్‌రెడ్డి, **ఐటీ వింగ్:** ఎస్.అమర్‌నాథరెడ్డి, **దివ్యాంగుల విభాగం:** సి.ఆంజనేయరెడ్డి, **డాక్టర్స్ విభాగం:** ఎస్.విశ్వనాథ ప్రతాప్, **పబ్లిసిటీ వింగ్:** నిమ్మల దస్తగిరి, **మేధావుల విభాగం:** పి.వెంకటరెడ్డి, **బూత్ కమిటీ విభాగం:** వై.కిరణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు.

కమలాపురం నియోజకవర్గం

యువజన విభాగం: జి.ఈశ్వర్‌రెడ్డి, **మహిళా విభాగం:** జి.భారతి, **రైతు విభాగం :** జి.విజయభాస్కర్‌రెడ్డి, **బీసీ సెల్:** సి.శివశంకర్‌యాదవ్, **ఎస్సీ సెల్ :** ఎస్.రవి, **ఎస్టీ సెల్:** బి.కృష్ణానాయక్, **మైనార్టీ సెల్:** ఎస్.మహమ్మద్ ఇర్ఫాన్‌బాషా, **క్రిస్టియన్ మైనార్టీ సెల్ :** డి..లారెన్స్, **విద్యార్థి విభాగం :** జి.సాయికుమార్‌రెడ్డి, **పంచాయతీరాజ్ విభాగం:** కె.రఘునాథరెడ్డి, **మున్సిపల్ విభాగం:** ఎస్.గేర్‌బాషా, **ఆర్టీఐ వింగ్:** సి.చందన్, **వలంటీర్స్ విభాగం:** జి.సదానందరెడ్డి, **గ్రీవెన్స్‌సెల్:** సి.గురవయ్య, **వాణిజ్య విభాగం:** ఎ.సురేష్‌బాబు, **వీవర్స్ విభాగం:** డి.వేణుగోపాల్, **వైఎస్సార్ టీయూసీ:** సి.షాషావలీ, **అంగన్వాడీ విభాగం:** తలారి జ్యోతి, **లీగల్ సెల్:** యు.శేషయ్య, **కల్చరల్ వింగ్:** ఎన్‌పీ శివాంజనేయరెడ్డి, **సోషల్ మీడియా విభాగం:** మిట్టా మాధవరెడ్డి, ఐటీ వింగ్: సయ్యద్ రహమతుల్లా, **దివ్యాంగుల విభాగం:** ఎస్.శివారెడ్డి, **డాక్టర్స్ విభాగం:** ఎస్ఎఫ్ అహ్మద్, **పబ్లిసిటీ వింగ్:** ఎంవీ సంతోష్‌కుమార్‌రెడ్డి, **మేధావుల విభాగం:** ఎ.శ్రీనివాసులు, **బూత్ కమిటీ విభాగం:** ఎస్.వెంకట రమణలు నియమితులయ్యారు.

ప్రొద్దుటూరు నియోజకవర్గం

యువజన విభాగం: డి.గురునాథరెడ్డి, **మహిళా విభాగం:** సి.ధనమ్మ, **రైతు విభాగం:** కె.బలరామిరెడ్డి, **బీసీ సెల్:** బి.నాగరాజు, **ఎస్సీ సెల్:** డి.విజయభాస్కర్, **ఎస్టీ సెల్:** కె.నరసింహులు, **మైనార్టీ సెల్:** ఎస్‌కే.అక్బర్, **క్రిస్టియన్ మైనార్టీ సెల్:** ఆర్.ప్రభుకుమార్, **విద్యార్థి విభాగం:** ఎస్‌సీ.మహమ్మద్‌దావూద్, **పంచాయతీరాజ్ విభాగం :** ఎ.రాజశేఖర్ రెడ్డి, **మున్సిపల్ విభాగం:** పి.బాలాజీ, **ఆర్టీఐ వింగ్:** కేకే.ప్రసాద్‌రెడ్డి, **వలంటీర్స్ విభాగం:** బీజీ.అక్బర్, **గ్రీవెన్స్‌సెల్:** యు.మురళీధర్, **వాణిజ్య విభాగం:** ఇ.లక్ష్మీనారాయణ రెడ్డి, **వీవర్స్ విభాగం:** సి.రవిచంద్ర, **వైఎస్సార్ టీయూసీ:** షేక్ ఖాజాపీర్, **అంగన్వాడీ విభాగం:** జి.కళావతి, **లీగల్ సెల్:** ఎ.సుదర్శన్, **కల్చరల్ వింగ్:** కె.వేణు, **సోషల్ మీడియా విభాగం:** ఎస్.మన్సూరిల్లా, **ఐటీ వింగ్:** సి.మహబూబ్‌బాషా, **దివ్యాంగుల విభాగం:** డి.రాజశేఖర్, **డాక్టర్స్ విభాగం:** యు.రంగయ్య, **పబ్లిసిటీ వింగ్:** డి.రామమోహన్‌రెడ్డి, **మేధావుల విభాగం:** ఎస్.రామప్రసాద్‌రెడ్డి, **బూత్ కమిటీ విభాగం:** ఎం.ఓబయ్య యాదవ్‌లు నియమితులయ్యారు.

మైదుకూరు నియోజకవర్గం

యువజన విభాగం : వై.చంద్ర ఓబుల్‌రెడ్డి, **మహిళా విభాగం :** బద్వేలు మహబూబ్, **రైతు విభాగం:** జి.నాగిరెడ్డి, **బీసీ సెల్ :** ఎస్.సుధాకర్, **ఎస్సీ సెల్:** జి.లక్ష్మయ్య, **ఎస్టీ సెల్ :** బి.కృష్ణ నాయక్, **మైనార్టీ సెల్:** షేక్ నాయబ్ రసూల్ , **క్రిస్టియన్ మైనార్టీ సెల్:** జి.బాపూజీ, **విద్యార్థి విభాగం:** సి.జమాల్‌వలీ, **పంచాయతీరాజ్ విభాగం:** ఎం.శంకర్‌రెడ్డి, **మున్సిపల్ విభాగం:** బీఎల్ రఘురామయ్య, **ఆర్టీఐ వింగ్:** ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి, **వలంటీర్స్ విభాగం:** ఎస్ఎం ఇబ్రహీం, **గ్రీవెన్స్‌సెల్:** వై.రామాంజనేయరెడ్డి, **వాణిజ్య విభాగం:** సి.వీర వెంకటస్వామి, **వీవర్స్ విభాగం:** ఎన్.శ్రీనివాసులు, **వైఎస్సార్‌టీయూసీ:** ఎం.ఒలివర్, **అంగన్వాడీ విభాగం:** గంజికుంట వెంకట చంద్ర, **లీగల్ సెల్ :** షేక్ ఇమామ్ బాషా, **కల్చరల్ వింగ్:** కె.వెంకటరమణ, **సోషల్ మీడియా విభాగం:** ఎస్.దస్తగిరి, **ఐటీ వింగ్:** జి.నవీన్‌కుమార్‌రెడ్డి, **దివ్యాంగుల విభాగం:** వై.సుబ్బరాయుడు, **డాక్టర్స్ విభాగం:** ఎం.రామ అనిల్‌కుమార్‌రెడ్డి, **పబ్లిసిటీ వింగ్:** ఎం.భరత్‌కుమార్‌రెడ్డి, **మేధావుల విభాగం :** ఎల్.శివప్రసాద్‌రెడ్డి, **బూత్ కమిటీ విభాగం:** ఎం.అబ్దుల్‌లు నియమితులయ్యారు.